క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు: జాతీయ రహదారి వద్ద విద్యుత్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నుచ్చుపొద ఫీడర్ నందులో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జిలానీ తెలిపారు. నుచ్చుపొద, ఇనిమెర్ల, తూర్పు కోడిగుడ్లపాడు, పోతవరం, జంగాలపల్లె, తిరగలదిన్నె గ్రామాలతో పాటు మండలంలోని బొట్లగూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

జీవాల పెంపకందారులను ఆదుకోవాలి

మద్దిపూడి: పిడుగుపాటుకు మృత్యువాత పడి నష్టపోయిన జీవాల పెంపకందారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ గొర్రెలు, మేకలపెంపకందారుల సంఘం, కార్మిక సంఘం(సీఐటీయూ)జిల్లా కార్యదర్శులు తోట తిరుపతిరావు, ఎం రమేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మేకల పోషణతో జీవనం సాగిస్తున్న వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



పెట్రోల్ బంకులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మురళి

కొండపి (సింగరాయకొండ): పెట్రోల్ బంకుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.మురళి హెచ్చరించారు. స్థానిక పెట్రోల్ బంకులను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెట్రోల్, డీజిల్ పరిమాణాలను, నాణ్యతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బంకుల్లోని మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గాలి పంపు మిషన్లు వినియోగదారులకు ఎప్పుడు అందుబాటులో ఉంచాలన్నారు.

సమ్మరీ రివిజన్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్‌ఇర్వీన్

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పి.జాన్ ఇర్వీన్ ఇటీవల జరిగిన ఇంటింటి సర్వే, నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌ల రేషనైజేలేషన్ గురించి వివరించారు. పట్టణంతో పాటు ఆరు మండలాల్లోని అన్ని కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఓటు హక్కు కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమం గురించి చర్చించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, నారపరెడ్డి శ్రీను, నరాల శ్రీనివాసులరెడ్డి, పీసీ కేశవరావు, వివిధ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



పేరంగుడిపల్లి వద్ద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరి రూరల్: వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆమె ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఆస్పత్రిలో చిన్న పిల్లల వార్డును, నవజాత శిశువులకు అవసరమైన అత్యవసర వైద్య సేవలు అందించేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న యంత్ర పరికరాలను పరిశీలించారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తల్లి బిడ్డల ఆరోగ్య సురక్షా విధానాన్ని అమలు చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి రూ.2 లక్షల చెక్కును కలెక్టర్‌కు అందచేశారు.

పేరంగుడిపల్లి వద్ద నిర్మాణాల పరిశీలన

మండలంలోని పేరంగుడిపల్లి జంక్షన్ వద్ద ఉన్న గృహ నిర్మాణాలను, ఇంటి స్థలాలను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే పరిశీలించారు. నడికుడి కాళ హస్తి రైలుమార్గం, హైవే రోడ్డు నిర్మాణంలో పోతున్న గృహ నిర్మాణాలను, ఇంటి పట్టాలను పరిశీలించి.. బాధితులతో మాట్లాడారు. నడికుడి కాళహస్తి రైలు మార్గం నిర్మాణంలో ఎంత మంది గృహాలను కోల్పోతున్నారు, ఎంతమంది ఇళ్ల పట్టాలు కోల్పోతున్నారనే రికార్డు ప్రకారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు తయారు చేసిన భూ బాధితుల జాబితాపై వివరాలు తెలుసుకున్నారు. తక్షణం నివేదికలు ఇవ్వాలని, బాధితులకు నష్టపరిహారం. ఇళ్ల స్థలాలు కేటాయింపునకు మరో చోట స్థలాల మంజూరుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ పి.జాన్ ఇర్వీన్, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, సర్పంచ్ ఇండ్లా మాలకొండ్రాయుడు, తహసీల్దార్, వీఆర్వోలు, సర్వేయర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



వెలిగండ్లలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ ఎన్ రంగాకృష్ణ



సింగరాయకొండలో అవగాహన కల్పిస్తున్న సైంటిస్టు రవీంద్రబాబు

పామూరు: రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకొని వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి కె.రాధ అన్నారు. మండలంలోని దూబగుంట్ల, నుచ్చుపొద సచివాలయాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రాధ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులనే వాడాలన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు బిందు, తుంపర సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సర్పంచ్ దారపనేని కొండబాబు, ఉద్యానవన శాఖాధికారి కె.కుసుమ, వీఏ మాలకొండమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ బి.అవినాష్ పాల్గొన్నారు.

వెలిగండ్ల: కందిలో వచ్చే శనగపచ్చ పురుగు, ఎండు తెగులు, వైరస్ తెగులు రాకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి ఎన్ రంగాకృష్ణ అన్నారు. మండలంలోని వెలిగండ్ల, కంకణంపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులు సాగు చేసిన సజ్జ, కంది పంటలను పరిశీలించారు. ఏఎంసీ సిబ్బంది బి. నారాయణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): వరి, మొక్కజొన్న, సజ్జ పైర్లను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని టెక్నికల్ ఏఓ టి.శిల్ప రైతులకు సూచించారు. మండలంలోని రేగులచెలక, చెన్నపునాయునిపల్లిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వరి, మొక్కజొన్న, సజ్జ పంటలను పరిశీలించారు. జింకు లోపాన్ని నివారించేందుకు ఎకరాకు 20 కేజీలు వేయాలని రైతులకు సూచించారు. పశువైద్యాధికారి డాక్టర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపూడి: కందికి ఆశించే కుచ్చు తెగులుపై



టంగుటూరులో పంట సాగు హక్కు పత్రం అందిస్తున్న ఎంపీడీఓ



పీసీపల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ

రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ అన్నారు. మండలంలోని రేగలగడ్డ, మద్దిపూడి గ్రామాల్లో మంగళవారం పొలంబడి పిలుస్తోంది నిర్వహించారు. చీడపీడల నివారణపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కొండపి (సింగరాయకొండ): పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెట్లూరు, మూగచింతల సచివాలయాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏపీఎంఐపీ ఎంఐఏఓ సుజాత, వ్యవసాయ సహాయకులు ఐ. పద్మ, కె.వెంకట్రావు, పశుసంవర్ధక సహాయకులు నాగేశ్వరరావు, విజయకుమార్, ఝాన్సీ రాణి, రైతులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సాగుచేసిన ఉద్యానవన పంటలు లాభదాయకంగా ఉంటాయని దర్శి హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ ఎం రవీంద్రబాబు సూచించారు. మండలంలోని కనుమళ్ల, కలికవాయ గ్రామాల్లో మంగళవారం ఉద్యానవన, వ్యవసాయ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుందిలో పాల్గొన్నారు. రవీంద్రబాబు మామిడి తోటల పునరుద్ధరణ, కొమ్మ కత్తిరింపులపై అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై గోపిచంద్ మాట్లాడుతూ మామిడి పంట దిగుబడిని ఏవిధంగా పెంపొందించుకోవాలో వివరించారు. ఉద్యానవన శాఖాధికారి ఎన్ తేజ, వ్యవసాయాధికారి వి.సుధాకరరావు, మత్స్య శాఖాధికారి సాయి వర్షిణి, సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: పంటల సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ వెంకటరమణ అన్నారు. మండలంలోని వరిమడుగు, పీసీపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కంది పంటలను పరిశీలించి సూచనలు చేశారు. ఇన్‌చార్జి ఏఓ పుల్లయ్య, మనోహర్, విజయ్ పాల్గొన్నారు.

టంగుటూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రత్నజ్యోతి అన్నారు. మండలంలో టంగుటూరు, ఆలకూరపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భముగా ఏఓ స్వర్ణలత శనగలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మద్దిరాల మమత, పశు వైద్యాధికారి విజయ మాధవి, మత్స్య శాఖాధికారి రవి కుమార్ పాల్గొన్నారు.



పామూరు: కంది, అంతర పంటలను పరిశీలించి సూచనలిస్తున్న ఏఓ రాధ



రేగలగడ్డలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటేష్

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస ప్రసాద్

కొండపి (సింగరాయకొండ): ప్రధానమంత్రి ఆవాస్ యోజన-1లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ పి.శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మన ఇళ్లు- మన గౌరవంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, 2025 మార్చి తర్వాత ఇళ్లు పూర్తి చేసినా నిధులు రావన్నారు. దీనిపై 26న సచివాలయంలో, 28న గ్రామంలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమణమూర్తి, హౌసింగ్ ఏఈ భూపతి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై గళం

- 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యేకు విన్నవించిన గ్రామస్తులు
- ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియడం లేదు.



ఎమ్మెల్యేకు అర్జీ అందజేస్తున్న సర్పంచ్ దేవకరుణమ్మ

హనుమంతునిపాడు: '' కొండారెడ్డిపల్లి పంచాయతీకి విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని'' గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు విద్యుత్ సమస్య తీవ్రతను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇళ్లు కట్టుకున్న వారికి ఇంత వరకు బిల్లులు రాలేదని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించకుండా విధి నిర్వహణలో అలసత్వం వహించిన అధికారులపై శాఖాపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి లైన్‌మన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఒకరి భూమిని మరొకరి పేరుతో ఆన్‌లైన్ చేయకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కొండారెడ్డిపల్లిలో దళితులు సాగు చేసుకుంటున్న భూమిని సాగు చేసుకోనివ్వాలని, అడ్డుకోవద్దని సూచించారు. రికార్డులు పరిశీలించి అర్హులకు పట్టాలు ఇస్తామని తెలిపారు. సర్పంచ్ కలుకూరి దేవకరుణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ కె.లలిత, తహసీల్దార్ డి.దిలీప్‌కుమార్, ఈఓఆర్డీ షేక్ షరీఫ్, డాక్టర్ సందీప్‌కుమార్, సర్పంచ్‌లు, బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. సూపర్‌వైజర్ షేక్ గౌషనీసాబేగం, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: బాలికలు సమాజంలో రుగ్మతలు, సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ రక్షణ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో మంగళవారం మండల న్యాయ సేవాధికార సంస్థ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ చదువు, విజ్ఞానం పెంచుకోవడంతో పాటు, బాల్య వివాహాలను అరికట్టడం, పౌష్టికాహార లోపం నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ అధికారి ఎస్ జయంతి, ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సుమతి, పారాలీగల్ వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, మంద్రు రమేష్, నవకుమార్ పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక 7వ సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు.

నియోజకవర్గ పోటీలకు ఎంపిక



నియోజకవర్గ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటిన జెడ్పీహెచ్ఎస్ కంబాలదిన్నె విద్యార్థులు

టంగుటూరు: కొండపి నియోజకవర్గ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 21 మంది ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసి ప్రభ తెలిపారు. ఈ సందర్భముగా పీడీ అరుణ మాట్లాడుతూ టంగుటూరు మండల స్థాయిలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో తమ విద్యార్థులు 33 పతకాలు సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా

పామూరు: మండలంలోని కంబాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండలస్థాయి స్కూల్‌గేమ్స్‌లో స్థానిక పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్-17, అండర్-14 బాల బాలికల విభాగంలో పాఠశాల నుంచి ఏకంగా నాలుగు జట్లు పోటీల్లో పాల్గొని బాల, బాలికల విభాగంలో సత్తా చాటి విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మహబూబ్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కబడ్డీలో సత్తాచాటిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కబడ్డీలో మెళకువలు నేర్పి విజయం సాధించేందుకు కృషి చేసిన పాఠశాల పీఈటీ నరసింహారావును అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పెదరాజుపాలెంలో రెండు రోజులపాటు ఉత్సాహంగా సాగిన మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. పాఠశాల హెచ్ఎం అరియారం సురేష్ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. విజేతలకు బహుమతులను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ సుభాష్, ఆదినారాయణ అందజేశారు. ఖోఖో అండర్-14, 17 విభాగంలో పెదరాజుపాలెం జెడ్పీహెచ్ఎస్ జట్టు, కబడ్డీ అండర్-14లో జెడ్పీహెచ్ఎస్ సీఎస్‌పురం, అండర్-17లో జెడ్పీహెచ్ఎస్ చింతపూడు నాగులవరం జట్టు, వాలీబాల్ అండర్-14లో జెడ్పీహెచ్ఎస్ నల్లమడుగుల జట్టు, అండర్-17లో పెదరాజుపాలెం జట్టు విజేతలుగా నిలిచి ట్రోఫీ, షీల్డ్ అందుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



పెద్దిరెడ్డి (ఫైల్)

మద్దిపూడి: మండలంలోని గుండ్లసముద్రంలో ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉప్పతి పెద్దిరెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..ఈ నెల 16న మృతుడు పెద్దిరాజు తన భార్యకు అనారోగ్యంగా ఉండటంతో కనిగిరి వైద్యశాలకు ఆటోలో బయలుదేరారు. ఆటో గుండ్లసముద్రం బస్టాండ్ సెంటర్‌లో బోల్తా పడటంతో పెద్దిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తొలుత పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నై తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

'ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు'

మద్దిపూడి: తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే..ఆ ఫిర్యాదును పట్టించుకోకుండా దాడి చేసిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు తీసుకున్నారని మండలంలోని అంకేపల్లి గ్రామానికి చెందిన కల్లగుంట్ల మాలకొండరాయుడు వాపోయాడు. వివరాల్లోకి వెళితే..కల్లగుంటకు చెందిన మాలకొండరాయుడు, ఆమె కుమార్తె అమూల్య మేకలు కాసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో అన్నదమ్ముల మధ్య వివాదం కొట్లాటకు దారితీసింది. టీడీపీ సానుభూతిపరుడైన కల్లగుంట్ల మాల్యాద్రి దాడి చేశాడని, దీనిపై పోలీస్‌స్టేషన్‌కు వెళితే పట్టించుకోలేదన్నారు. కానీ దాడి చేసిన మాల్యాద్రి ఇచ్చిన కేసు తీసుకున్నారని వాపోయాడు. దీంతో ఒంగోలులోని ఎస్పీ దామోదర్‌ని రెండుసార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చానని తెలిపాడు. కేసును పరిశీలించాలని కొండపి సీఐ, మద్దిపూడి ఎస్సైలను ఎస్పీ ఆదేశించినా పట్టించుకోవడం లేదని వాపోయాడు.

సమాచార చట్టంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ రమణ

హనుమంతునిపాడు: స్థానిక రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరి డివిజన్ ఏడీఏ రమణ, ఏఓ కె.రమణ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తిగా సమాచారం పొందే హక్కు ప్రతి పౌరునికి ఉందన్నారు. ఎంఈఓజి.పెద్దిరాజు, ఎంపీడీఓ కె.లలిత, టీడీపీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతరెడ్డి, వ్యవసాయాధికారులు గోపీక్రిష్ణ, ఏఓ క్రిష్టారావు, ఎంపీటీసీ ఉడుమల వెంకటసుబ్బారెడ్డి, ఈఓఆర్డీ షేక్ షరీఫ్, వీఏఏలు గాయం రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.358

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ. 304.08గా నమోదైంది. వేలం కేంద్రానికి దావగూడూరు, చింతలపాలెం, తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 424 బేళ్లను వేలానికి తీసుకురాగా 293 బేళ్లను కొనుగోలు చేసి 131 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190 పలికింది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి (సింగరాయకొండ): స్థానిక వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో గరిష్ట ధర రూ.358 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1176 బేళ్లను వేలానికి తీసుకురాగా 975 బేళ్లను కొనుగోలు చేసి 201 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.169, సరాసరి రూ.257.66 పలికింది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యానికి సహకరించాలి

సీఎస్‌పురం(పామూరు): స్థానిక పామూరురోడ్డు, వడ్డెపాలెం రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో ఈఓపీఆర్డీ కె.సుందరరామయ్య ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్నా కాల్వల్లో చెత్త వేయడం, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు వేయడం వల్ల కాల్వలు పూడుకుపోయి దోమల బెడద అధికమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పి.రాంప్రసాద్, జి.వాణి, శేషారెడ్డి, కొల్లు రమణయ్య, సిబ్బంది ఉన్నారు.